# కేసు మీద కేసు

రైలుకు ఇంకా గంటున్నర వ్యవధి వుంది, అక్కడనుంచి ఎంత త్వరగా బయటు పడితే అంత మంచి దనిపించింది.

అనవసరంగా మనసు పాడుచేసుకున్నాడు. వరుసగా రెండు రాత్రిళ్ళనుంచి ఆమెను గురించి ఆలోచిస్తూ నిద్రపాడు చేసుకున్నాడు. ఏ పన్నెండింటికో ఒంటి గంటకో నిద్ర పడితే ఆ నిద్రలో కూడా ఆమెను గురించిన కలలు!

చిత్ర మేమిటంటే ఆమెను గురించి తనకు ఏమీ తెలీదు. డాక్టరింటికి ఎదురింట్లో వుంటున్నది ఆమె. మూడు రోజులనాడు తను వరండాలో కూచుని పేపరు చూస్తున్నాడు. ఆమె డోర్ కర్టెన్ పక్కకి తొలగించుకొని వచ్చి వాకిట్లో నిలబడ్డది. సన్నగా, ఎర్రగా, పెద్ద పెద్ద కళ్ళతో చూడ ముచ్చటుగా ఉన్నది. ఆమె తన్ను గమనించినట్టు లేదు. ఏదో పోగొట్టుకొన్న దానికిమల్లే బజారు కేసి చూస్తోంది. పేపరు చూడటం మాని ఆమె కేసి చూస్తూ కూచున్నాడు తను. ఆవిడ చాలా సేపు అలాగే నిలబడి వుంది. తర్వాత లోపలికి వెళ్ళి దభీమని తలుపు వేసుకుంది.

ఆ అమ్మాయి అలా యింట్లోకి వెళ్ళిన తర్వాత కూడా విశ్వనాథం గారు అలాగే చాలా సేపు ఆ యింటి కేసి చూస్తూ కూచున్నారు. ఆ యింట్లో ఎవరూ వున్నట్టు లేదు. బహుశా భార్యా భర్తా ఇద్దరే వుండ వచ్చు. భర్త ఆఫీసుకు పోయ్యాడేమో అనుకున్నాడు.

ఆ అమ్మాయిని చూచిన తర్వాత, ఆ అమ్మాయి భర్తను గురించి



ప్రథమ బహుమతి [రూ. 50]

ఎస్. జయరామరెడ్డి

(బి. ఇడి. క్లాస్, కె. ఎస్. కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, బళ్ళారి)

వూహించకుండా వుండలేక పోయ్యాడు.

విశ్వనాథం వూహాలో చక్కటి అబ్బాయి మెదిలాడు. ఎర్రగా, నొక్కుల జుత్తు, కంటికి రిమ్‌లెస్ అద్దాలూ - అన్ని విధాలా ఆ అమ్మాయికి తగిన భర్త!

తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు.

మరి నిజంగా ఆ అమ్మాయిది అన్ని విధాలా అనుకూల దాంపత్యమైతే ఆ కళ్ళల్లో దిగులేమిటి? ఏదో పోగొట్టుకొన్న దానికిమల్లే అలా చూస్తూ నిలబడ్డ దెందుకు? లేదు — ఆ అమ్మాయి జీవితంలో ఏదో పోగొట్టుకున్నది. బాధపడుతున్నది!

ఆ అమ్మాయి భర్తను చూస్తే కొన్ని విషయాలు వూహించవచ్చు. ఆ అమ్మాయి భర్త తను వూహించినట్టు, అందమైన వాడైనా, ఆ అమ్మాయిపట్ల అతనికి ప్రేమలేకపోవచ్చు. ఆ అమ్మాయి అంటే లక్ష్యం లేకపోవచ్చు. లేదా బొత్తిగా రసికత్వంలేని చవట కావచ్చు. ఏదో ఉన్నది. అదితెలుసుకోవాలన్న జిజ్ఞాస అంతకంతకూ విశ్వనాథంగారిలో బలపడసాగింది.

విశ్వనాథంగారు మళ్ళీ నాలుగింటికి వరండాలో కూచున్నాడు. అట్లా కూర్చోవడంలో, విశ్వనాథంగారి వుద్దేశం ఆ అమ్మాయిని చూడాలని!

వేటగానికి మల్లే ఆరుగంటల వరకూ అలాగే కాపువేసి కూచున్నాడు. సరిగ్గా ఆరింటికి ఒక వ్యక్తి వచ్చి తలుపు తట్టడం చూచాడు. ఎక్కడలేని జుగుప్సా కలిగింది. తను ఊహించిన లక్షణాలు ఏ ఒక్కటి అతనిలో లేవు. అతనికి వయసు మళ్ళింది. వార్థక్య చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మనిషి నల్లగా, పీలగా, పీనుగుమల్లే వున్నాడు.

ఆ అమ్మాయి జీవితంలో యేం పోగొట్టుకొందో కళ్ళముందు స్పష్టంగా కనిపించింది. ఆ అమ్మాయి మీద విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది.

విశ్వనాథానికి ఆ రోజు రాత్రి అన్నం రుచించలేదు. మనసంతా అస్తవ్యస్తమైపోయింది.

రాత్రి పడుకుంటే పక్క కుదరలేదు. నిద్ర రాలేదు. ఆ అమ్మాయిని గురించిన ఆలోచనలే. ఏ పన్నెండింటికో కాస్త కలతనిద్ర పట్టింది. రకరకాల కలలు వచ్చాయి. ఆ అమ్మాయి బట్టలమీద కిరసనాయిలు పోసుకొని నిప్పంటించుకున్నది. ఇంట్లోనుంచి మంటలు - పొగలు, ఇంటిచుట్టూ జనం పోగయ్యారు. గునపాలతో తలుపులు పగలగొడుతున్నారు!

విశ్వనాథం కెవ్వున కేక వేసి కూర్చున్నాడు. తర్వాత నిద్ర పట్టలేదు. వెళ్ళి కిటికీ తెరచి ఆ యింటి వైపు చూచాడు. గ్లాస్ విండోస్ గుండా పచ్చటి బెడ్‌రూము లైట్ కాంతి కనిపిస్తోంది. కిటికీ చువ్వలు పట్టుకొని, అట్లాగే, ఆ యింటి వైపు చూస్తూ నిలుచున్నాడు.

ఉదయం ఎనిమిదింటికి ఆమె మళ్ళీ గడపలో నిల్చుంది. తెల్లటి చీర-తెల్లటి రవికా — రాయంచలా గుమ్మంలో నిల్చుంది. రోడ్డుమీద

పోయే జనాన్ని, కార్లని, బస్సుల్ని చూస్తున్నది. ఒకటి రెండు సార్లు విశ్వనాథం వైపు చూసింది.

విశ్వనాథానికి అక్కడ ఉండటం ముళ్ళమీద దున్నట్టుంది. గబగబా బెడ్డింగు సర్దాడు. ఇంతలో కాఫీ వస్తే, అది కూడా ముగించి-డాక్టరు తోనూ—ఆయన భార్య సుశీలతోనూ సెలవు తీసుకుందామని – గబగబా మెట్లుదిగి కిందికి వచ్చాడు.

మండువాలో సుశీల ఎవరితోనో మాట్లాడుతోంది. ఆ మాటలు తనకు సంబంధించినవి. విశ్వనాథం లోపలికి వెళ్ళకుండా గడపలోనే తచ్చాడుతూ నిలుచున్నాడు. మాటలు స్పష్టంగా వినిపిస్తున్నవి.

'ఆయన, విశ్వనాథం గారని మా వారికి ఫ్రెండు. ఏదో పనిమీద వచ్చాడు. ఇవ్వాళో రేపో వెళతారు' అంటున్నది సుశీల.

అవతలి వ్యక్తి సన్నగా నవ్వడం వినిపించింది. తర్వాత 'ఎవరో పేషంటనుకున్నాను. మూడు రోజుల నుంచి చూస్తున్నాను. వరండాలో కూచొని బజారుకేసి దిగులుగా చూస్తుంటాడు. టి. బి. లాంటి వ్యాధేమో, ప్రాణభయం గామాలు అనుకున్నాను అయితే డాక్టరుగారి ఫ్రెండన్నమాట. ఏమిటో ఒకోసారి పిచ్చిగా ఆలోచిస్తాము. ఆ ఆలోచనలకు అర్థం పర్థం వుండదు"

విశ్వనాథానికి తల గిర్రున తిరుగుతున్నట్టయింది. లోపలికి తొంగి చూచాడు. ఆ అమ్మాయి!

లోపలికి వెళ్ళడమా. మానడమా అన్న సందిగ్ధంలో పడ్డాడు. వెనక్కు తిరుగుతున్నాడు.

'ఎవరూ? విశ్వనాథం అన్నగారా? లోపలికి రండి' అన్నది సుశీల. ఎవరో వెనక తోస్తున్నట్టు లోపల అడుగుపెట్టాడు. ఆ అమ్మాయి తనవైపు వింతగా చూస్తూ బయటకు వెళ్ళిపోయింది.

విశ్వనాథంగారికి గొంతు పెగల లేదు. కష్టం మీద 'వూరికి వెళ్తున్నానమ్మా, చెప్పిపోదామని వచ్చాను' అన్నాడు.

సుశీల కొడుక్కి రిక్షా పిలవమని చెప్పి 'చూచారా అన్నగారూ! ఎదురింటి జానకి మిమ్మల్ని చూచి...'

విశ్వనాథంగారు మధ్యలోనే మాటతుంచుతూ. 'విన్నాను' అన్నాడు పేలవంగా నవ్వి.

జానకి తన్ను గూర్చి అట్లా వూహించినందుకు వంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్టుంది. అట్లాంటి స్థితిలో కూడా, విశ్వనాథానికి ఆమెను గూర్చి తెలుసుకోవాలన్న జిజ్ఞాస సడల లేదు.

'ఎవరమ్మా, ఆమె? యథాలాపంగా అడుగుతున్నట్టు అడిగాడు.

'మన ఎదురింట్లో వుంటున్నారు. ఆ అమ్మాయి భర్త లెక్చరరు. ప్రేమించి పెళ్ళిచేసుకున్నారిద్దరూ' అన్నది సుశీల.

తలమీద సుత్తితో కొట్టినట్టు అదిరిపడ్డాడు విశ్వనాథం. 'వస్తానమ్మా' అంటూ వెళ్ళి రిక్షాలో కూచున్నాడు. ప్రక్క రూములో వున్న డాక్టరుతో చెప్పి వెళ్ళాలన్న విషయం కూడా స్ఫురించలేదు ఆయనకి ఆ క్షణాన.

□□□